క్లుప్తంగా

నీట్ ర్యాంకర్‌కు అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం : నీట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో జాతీయస్థాయిలో 18వ ర్యాంకు సాధించిన తోటే జ్యోస్విద్ కృపాకుమార్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్థానిక క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థ డైరెక్టర్లు శ్రీనివాసవర్మ, సాయి రాజు, విద్యార్థి తల్లిదండ్రులు జ్యోతి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

విష్ణు క్యాంపస్‌లో రక్తదాన శిబిరం



భీమవరం విష్ణు విద్యాసంస్థల్లో రక్తదాన శిబిరం నిర్వహించిన దృశ్యం

సాక్షి, భీమవరం : అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని భీమవరం విష్ణు క్యాంపస్‌లోని వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆనంద బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సుమారు 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం విష్ణు క్యాంపస్ డైరెక్టర్లు జె.ప్రసాద్‌రాజు, కె.సూర్యనారాయణ, ప్రిన్సిపాళ్లు కె.నటరాజు, కృష్ణంరాజు రక్తదాతలను అభినందించారు.

కనకదుర్గమ్మ ఆలయం షెడ్ ప్రారంభం



షెడ్ ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల : కాళ్లకూరు వెంకటాపురం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డును బుధవారం ప్రారంభోత్సవం చేశారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు, అలాగే ఏటా ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దాతలు కోవాగాని నరసింహనాయుడు గౌరీ జ్ఞాపకార్థం వారి కుమారుడు నారాయణ స్వామి సహకారంతో ఈ షెడ్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సాధు శ్రీదేవి, నడింపల్లి ప్రదీప్ ఈ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో దండు వెంకట కృష్ణంరాజు, తోటకూర రవి, సాధు శ్రీను, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు హాజరయ్యారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రను ప్రారంభించిన దృశ్యం

ఆకివీడు : స్థానిక దత్త క్షేత్రం వద్ద ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రంను నగర పంచాయతీ మేనేజర్ డి.వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దాహార్తిని తీర్చడం ఎంతో పుణ్యమన్నారు. కార్యక్రమంలో దత్త క్షేత్రం కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి., సినీ డిస్ట్రిబ్యూటర్ ముదునూరి శ్రీహరిరాజు, గొట్టుముక్కల విద్యా సాగర్, దత్త సేవకులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో విద్యార్థుల ప్రతిభ



పి.మనోజ్ కుమార్, ఎంసెట్ 281 ర్యాంకు



ఎల్. రాకేష్ వెంకట సాయి, ఎంసెట్ 286వ ర్యాంక్

భీమవరం అర్బన్ : ఏపీ ఎంసెట్‌లో నాగిడిపాలెంకు చెందిన పొన్నమండ మనోజ్‌కుమార్ సత్తాచాటి 281వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంక్ సాధించగలిగానని చెప్పాడు. ఐఐటీ మద్రాస్‌లో చేరి అనంతరం సివిల్స్ రాసి కలెక్టర్ అవ్వడమే తన ముందున్న లక్ష్యం అని తెలిపాడు.

లంకా రాకేష్‌కు 286వ ర్యాంక్

పాలకోడేరు : ఏపీ ఎంసెట్‌లో పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన లంకా రాకేష్ వెంకట సాయి 286వ ర్యాంక్ సాధించాడు. రాకేష్ తండ్రి కృష్ణ పోస్టల్ శాఖలో పని చేస్తూ కోవిడ్‌తో మృతి చెందాడు. దీంతో తల్లి ధనలక్ష్మి తనకు వస్తున్న జగనన్న పింఛన్ సాయంతోనే రాకేష్‌ను చదివించారు. ఐఐటీ పూర్తి చేసి, సివిల్స్ ద్వారా కలెక్టర్ అవ్వాలనేది తన ఆకాంక్ష అని రాకేష్ చెప్పాడు.

ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ పాలన

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



గూట్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్ : దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.21 లక్షలతో నిర్మించనున్న విలేజ్ క్లినిక్ సెంటర్‌కు ఎమ్మెల్యే శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,546 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అన్ని వర్గాల ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని నవరత్నాలు మేనిఫెస్టోను రూపొందించి అధికారం చేపట్టగానే నాలుగేళ్ల కాలంలో 99 శాతం హామీలను అమలు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా కీర్తి ఘడిస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను అనుగుణంగా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించే పనిలో భాగంగా సచివాలయ వ్యవస్థను తీసుకుని ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కరోనా విలయతాండవం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపినా సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రతి కుటుంటానికి రూ. 50 వేలు నుంచి 5 లక్షల వరకు ఆర్థిక లబ్ధి చేకూర్చారని గుర్తు చేశారు. గత నాలుగేళ్లలో రూ. 1200 కోట్ల మేర ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. ఇదే సమయంలో నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా పశ్చిమ గోదావరి జిల్లాకు భీమవరం కేంద్రంగా ఏర్పడటం వల్ల జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రజలకు ప్రభుత్వ ఉన్నత అధికారులు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. నాడు-నేడు పథకంలో విడతల వారీగా ప్రతి ప్రభుత్వ పాఠశాలను జాతీయ స్థాయి ప్రమాణాలతో కార్పొరేట్ స్కూల్స్‌కి మించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. తొలుత ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయన్ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై.రవికుమార్, వైస్ ఎంపీపీ కొప్పర్తి పద్మజ, రాష్ట్ర ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ కొప్పర్తి వీర వెంకట సత్యనారాయణ, సర్పంచ్ ఒడుగు ముత్యాలరావు, జిల్లా కొండయ్య, ఎంపీటీసీ తిరుమాని తులసీరావు, చెలంకూరి సత్యనారాయణమూర్తి, చెలంకూరి శివ హనుమ ప్రసాద్, జవ్వాది గణేష్, వర్ధనపు పెంటయ్య, ఏఎస్ రాజు, కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, నాగిడి నారాయణస్వామి, ఆరేటి పెద్దబ్బు, నామన మహేష్, తిరుమాని ధనంజయరాజు, కోమటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భీమవరం అర్బన్ : తనపై అన్యాయంగా దాడిచేసి కొట్టి గాయపరిచారని ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం నరసింహపురం గ్రామానికి చెందిన ములపర్తి శ్రీనుని అదేగ్రామానికి చెందిన ములపర్తి యేసేబు, నార్కిమెల్లి జాన్ ప్రకాష్, నార్కిమెల్లి లూథియా, ములపర్తి సుధీర్ అన్యాయంగా కొట్టి గాయపరిచారని బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపర్ వైరు చోరీ

ఆకివీడు : గుమ్ములూరు గ్రామంలో జియో సెల్ టవర్‌లో సుమారు 200 మీటర్ల కాపర్ వైరు దొంగతనంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. అదే కంపెనీలో పనిచేస్తున్న విశాఖపట్నం జిల్లా యలమంచిలికి చెందిన జంగం నాగేశ్వరరావు, పినుపోలు మణికంఠ దొంగిలించినట్లు టవర్ ఎంప్లాయ్ జి.రామచంద్ర ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రయోజనాలపై అవగాహన



పాలకోడేరు : వేంద్ర అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కాళ్ల : కాళ్లకూరులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పాలకోడేరు : ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నం అన్నారు. జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా వేంద్ర 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారుల తల్లులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు, గర్భిణీలలో, చిన్నారులలో పోషకాహార లోపాన్ని నివారించేందుకు క్షేత్ర స్థాయిలో చేస్తున్న కృషిని వివరించారు.

కాళ్లకూరులో...

కాళ్ల : బాల్యదశలో కలిగించే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ హేమలత అన్నారు. కాళ్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భగీదారీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులకు పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పూర్వ ప్రాథమిక విద్య సమాజంలోని వారి ప్రవర్తన పిల్లల శారీరక, మానసిక, వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధు శ్రీదేవి, అంగన్‌వాడీ మార్తమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆట పాటలతో చిన్నారులకు మేథస్సు

భీమవరం అర్బన్ : ఆట పాటలతో చిన్నారులకు మేథస్సు పెరుగుతుందని దిరుసుమర్రు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు, కొవ్వాడ పుంత, బేతపూడి, తాడేరు గ్రామాలలో ప్రీస్కూల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత రోలర్ స్కేటింగ్ శిక్షణ



రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రోలర్ స్కేటింగ్‌పై నెల రోజులు పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవి మురళీ కృష్ణంరాజు చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నతనం నుంచి పిల్లలు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మురళీకృష్ణంరాజు అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఎటువంటి రుసుము లేకుండా కళాశాల సహకారంతో విశాఖపట్నంలోని లాస్ట్ లీయో స్కేటింగ్ అకాడమీ కోచ్ జె చిరంజీవిరాజు పర్యవేక్షణలో శిక్షణ అందించమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ హరిమోహన్, జి.సారిక, అవినాష్, వాలీబాల్ కోచ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్



పాలకోడేరులో ఫోన్‌లలో దిశ యాప్ డౌన్లోడ్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకోడేరు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దిశ యాప్‌పై పాలకోడేరు మండలంలో అన్ని గ్రామాల్లో బుధవారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహనదారులను ఆపి వారి ఆండ్రాయిడ్ ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసి అవగాహన కల్పించారు. మహిళల రక్షణ విషయంలో వెన్నంటే ఉంటామని రాజీపడే ప్రసక్తే లేదని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు ఎస్ఓఎస్ బటన్ నొక్కినా లేక షేక్ చేసినా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ డ్రైవ్ రెండు రోజులపాటు నిర్వహించి టార్గెట్ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై డీవీవీ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, మహిళా కానిస్టేబుల్ భవాని, మహిళా పోలీసులు పూర్ణిమ, శ్రీదేవి, లలిత, వాసంతి, భవాని, కృష్ణవేణి, కె.బేబీ, రేఖ, బొక్కా నాగలక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో సీఎస్‌అండ్‌ఐటీ కోర్సు ప్రారంభం

సాక్షి, భీమవరం : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అదనపు కోర్సుతోపాటు ప్రస్తుతం ఉన్న కొన్ని బ్రాంచీలలో అదనపు సీట్లకు ఏఐసీటీఈ అనుమతించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ, ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు చెప్పారు. బుధవారం ఆయన కళాశాలలో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఏఐసీటీఈ తమ కళాశాలకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్స్ (సీఎస్‌అండ్‌ఐటీ) మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే తమ కళాశాలలో ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు సంబంధించి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బేస్డ్ కోర్సులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ ఇంక్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు కోర్ గ్రూపులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ గ్రూపులతో 1,860 మంది విద్యార్థులను మొదటి సంవత్సరంలో చేర్చుకునే అవకాశముందన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ కళాశాల వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసి రాజు

సాక్షి, భీమవరం : రోడ్డు ప్రమాదాలతో ఎక్కువ మంది గాయపడుతున్నందున వారి ప్రాణాలను కాపాడటానికి రక్తం అవసరం ఎంతైనా ఉందని అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రక్తదానంపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో రాజు మాట్లాడుతూ రక్తదానంపై పూర్తి అవగాహన కలిగించేలా, ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకువచ్చేలా జిల్లా అంతటా ర్యాలీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక రైల్వే జంక్షన్ వద్దగల కళ్యాణ మండపంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున రక్తదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ జి భానునాయక్, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ మంతెన శివరాంభద్రిరాజు, రెడ్ క్రాస్ లైఫ్‌మెంబర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసు చూపిన మార్గం ఆచరణీయం



చర్చ్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి : మనిషి ప్రశాంతంగా జీవించాలంటే దైవభక్తి కలిగి ఉండాలని, ఏసు చూపిన మార్గం అనుసరణీయమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం పాస్టర్ ఈదా విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఉండిలో పెనూయేలు ప్రార్థనా మందిర పునఃనిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చర్చ్ నిర్మాణానికి పూనుకున్న పాస్టర్ ప్రసాద్, వారి సంఘానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలతో మనిషిలో సేవాభావం, మానవత్వం అలవడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇదంకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, బడుగు బాలాజీ, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ళ, వీరవాసరం, భీమవరం మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు ఆణిముత్యాలకు సత్కారం

ఉండి, ఆకివీడు : ఉండి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఏ రవీంద్ర తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరించి ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.10వ తరగతిలో అల్లు ఓం సాయిశ్రీనివాస్ (579), గూడవల్లి దుర్గాదేవీప్రసన్న (573), ఆకుల శ్రావణి (572), ముత్యం సౌజన్య మనోహరీ (572) మొదటి మూడుస్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో ప్రథమస్థానంలో నిలిచిన డీవీ లక్ష్మీ (899), జి.సంధ్యారాణీ (911) పి.మౌనిక (958) ఒకొక్కరికీ రూ.15 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఇతర ప్రజాప్రతినిధులు హాజవుతున్నట్లు ఎంఈవో తెలిపారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు



కొత్తపేటలో సీసీ రహదారుల నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్ సోనియా రమేష్

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ అన్నారు. గుమ్మలూరు శివారు కొత్తపేట, రావిగొప్పు, పెదపేట ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రహదారుల నిర్మాణ పనులను బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు గ్రామస్తులు రోడ్ల సమస్యలు విన్నవించారన్నారు. వారి విజ్ఞప్తిమేరకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి కొత్తపేటలో రూ.10 లక్షలు, రావిగొప్పులో రూ.10 లక్షలు, పెదపేటలో రూ.20 లక్షలు నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు రూ.కోట్ల నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, ఎంపీటీసీ అంబటి సుధాకర్, కుక్కల నాగేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, పైడి నాగమణి, గొట్టుముక్కల సురేష్, పైడి ఈశ్వరరావు, పైడి పండు, ఏలూరి ఆశీర్వాదం, పొలమూరి భూషణం, గొట్టుముక్కల సామ్యేలు పాల్గొన్నారు.

వేగవంతంగా తాడేరు వంతెన పనులు



తాడేరు వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం : తాడేరు వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.2.30 కోట్లతో నిధులతో ఈ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. 1929లో నిర్మాణం జరిగిన ఈ వంతెన స్థానంలో తన హయంలో నూతన వంతెన నిర్మాణానికి నోచుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. రాజకీయాల్లో ప్రజలకు సేవ చేస్తేనే సంతోషం ఉంటుందని, అంతేగాని పదవులను అలంకారంగా చేసుకోవడం వల్ల ప్రజలకు మేలు జరగదని ఆయన అన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై ఉన్న వంతెనలకు కూడా అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా ఇప్పటికే రూ.36 కోట్ల నిధులను మంజూరు చేయించామని త్వరలోనే టెండర్ ప్రక్రియ జరుగుతుంది అని అన్నారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు

మొగల్తూరు: ప్రధాన కాలువలు వదిలినా ప్రతి శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరందెలా పంటబోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మొగల్తూరు, పాతపాడు, కోమటితిప్పలో పంట బోదెల్లో మట్టి మేటలు వేయడంతో తవ్వకం పనులు చేపట్టారు. ప్రతి ఎకరాకు నీరందేలా పంట బోదె తవ్వకం పనులు చేపట్టామని ఏపీవో వై శ్రీనివాస్ తెలిపారు.

ఆకివీడు తహసీల్దార్‌గా విజయలక్ష్మి



నడింపల్లి భారతీ విజయలక్ష్మి

ఆకివీడు : ఆకివీడు తహసీల్దార్‌గా నడింపల్లి భారతీ విజయలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట నియోజకవర్గం నుంచి ఆమెను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లును నర్సాపురం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. తహసీల్దార్‌గా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

చేపల వేలం

ఆకివీడు : స్థానిక మంచినీటి చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు బుధవారం నగర పంచాయతీ ఆవరణలో వేలం నిర్వహించారు. భుజబలరాయుడు మంచినీటి చెరువులో చేపలు పట్టుకునేందుకు రూ.40,500, సమ్మర్ స్టోరేజ్ చెరువులో చేపలు పట్టుకునేందుకు రూ.65 వేలకు వేలంపాట నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ కె.రాజకుమార్, మేనేజర్ డీ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వేలం జరిగింది.

నేడు వాహన వేలం

ఆకివీడు : ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన ఏపీ 39 టీఎఫ్ 9034 నెంబర్ గల టాటా యోధా వ్యాన్‌ను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు ఈ వేలం వేస్తున్నట్లు తెలిపారు. వాహనం కనీస ధర రూ.1,60,000, 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో ఎక్సైజ్ సెబ్ సీఐ డీ.రామారావు పాల్గొంటారన్నారు.

వైభవంగా స్వామి కల్యాణం

ఆకివీడు : స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలు, మేళ తాళాలతో, వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహించారు. తొలుత గోపూజ, అనంతరం నవగ్రహాల సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గొంట్లా గణపతి, కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి, కాకర్ల ఫణి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

పాలకొల్లు అర్బన్: ఎలక్ట్రికల్ ఏఈ తీరుని నిరసిస్తూ పూలపల్లి సబ్ స్టేషన్ వద్ద చింతపర్రు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మూడు నెలలుగా గ్రామంలోని బాడవ వద్ద గల 63 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, 11,12 వార్డు సభ్యులు మైలా మరియమ్మ, వీరమల్లు సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు.